క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ బ్రాహ్మణపల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీగణేశ్‌నగర్ కాలనీ, ఓం గణేశ్ నగర్, జీవీఆర్ కాలనీ, గణేశ్ నగర్ కాలనీ ఫేజ్ 2, రెవెన్యూ కాలనీ, రాజీవ్ గృహకల్ప, మన్నెగూడ, ఏపీఆర్ హౌజింగ్ ప్రాజెక్ట్స్, బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్ ఏరియా, మన్నెగూడ పాత గ్రామంలో సరఫరా నిలిపివేయనున్నామని ఆయన తెలిపారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం



డైరెక్టర్లను సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

యాచారం: మండలం నుంచి ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఎన్నికైన మస్కు నర్సింహ, గులాం అక్బర్‌తో పాటు.. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన జయప్రకాశ్‌లను ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. పదవులతో పనిలేకుండా, పార్టీ బలోపేతం కోసం కృషి చేసే వారికే తగిన గుర్తింపు ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనువాస్ ముదిరాజ్, నాయకులు భాస్కర్‌గుప్తా, తిరుమలేష్, వెంకట్‌రెడ్డి, అనిల్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి



శ్రీనివాస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఇబ్రహీంపట్నంలోని ప్రైవేట్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. తమిళనాడు రాష్ట్రంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన రామానుజన్, పాఠశాల స్థాయి నుంచే చురుకైన విద్యార్థి అని తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందాలంటే డబ్బులు లేని పరిస్థితుల్లో ఉండే వారని గుర్తుచేశారు. గణితంలో తన శక్తిసామర్థ్యాలను ఉపాధ్యాయుల ఎదుట ప్రదర్శించి కళాశాల ప్రవేశం పొందిన మహనీయుడని కొనియాడారు. ఆయన జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఇళ్లు మంజూరు చేసేది ప్రభుత్వమా.. పార్టీనా?



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎందుకు పాల్గొంటున్నారని, ఇండ్లు మంజూరు చేసేది ప్రభుత్వమా.. ఆ పార్టీనా అని బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ ప్రశ్నించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే కార్యక్రమంలో అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొనడాన్ని తప్పుపట్టారు. ఇంతవరకు ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారితో కలిసి సర్వే చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. నిరంజన్‌గౌడ్, శ్రీనునాయక్, వెంకటేశ్, శివకుమార్, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

25న రక్తదానం శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామంలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాష, క్యాంపు చైర్మన్ మధన్‌గౌడ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేయాలని వారు కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డిలు అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆదివారం మండల పరిధి ఎల్మినేడు అనుబంధ గ్రామం మెటిల్లాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం కంపు.. ఆరోగ్యాలకు ముప్పు

కంపెనీలను తరలించాలంటూ డిమాండ్



సాగర్‌రోడ్డుపై నిరసన వ్యక్తంచేస్తున్న బాధిత ప్రాంత ప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్: కర్మాగారాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, విష వాయువులతో పరిసర ప్రాంతాలు కాలుష్యం బారిన పడుతున్నాయని కాలుష్య వ్యతిరేక పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. తద్వారా గాలి, నీరు కలుషితమై ప్రజలు, పశుపక్షాదులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్, ఎంపీపటేల్‌గూడలో విజయలక్ష్మి, సీఎంఆర్ రిచ్‌మీడోస్, అంతఃపురం కాలనీ, రాఘవేంద్రకాలనీ, సప్తగిరి, గంగానగర్ ప్రాంత ప్రజలు బొంగ్లూర్ సాగర్ రహదారిపై రస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని రైస్‌మిల్లులు, ప్లైవుడ్ కంపెనీల నుంచి వెలువడుతున్న విషవాయువులతో కాలుష్యం పెరిగిపోయిందని వెల్లడించారు. విషవాయువులు, తీవ్ర దుర్వాసనతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని వాపోయారు. ఇప్పటికే పలువురు ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. కాలుష్య కారక సంస్థలపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని, వాటిని ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి చూపండి..



ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, చిరువ్యాపారులు

ఆమనగల్లు: 'జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మా దుకాణాలు తొలగించారు. అప్పటి నుంచి ఉపాధిలేక ఇబ్బంది పడుతున్నాము. స్థానికంగా దుకాణ సముదాయం నిర్మించి.. ఉపాధి కల్పించాలి' అని ఆమనగల్లు పట్టణ చిరువ్యాపారులు కోరారు. ఈ మేరకు ఆదివారం నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవికి నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. షాపులు తొలగించడంతో వీధిన పడ్డామని పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం, బాలుర ఉన్నత పాఠశాల చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, ఆదుకోవాలన్నారు. ఇదే విషయమై గతంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశామని వెల్లడించారు. ఇందులో మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, చిరు వ్యాపారుల సంఘం నాయకుడు గాజుల శ్రీను, రూపం వెంకట్‌రెడ్డి, నరేందర్, సుధాకర్, రజాక్, జానీ తదితరులు ఉన్నారు.

మాడ్గులలో మరో రెండు గ్రామాలు



మాడ్గుల: మాడ్గుల మండలంలో మరో 2 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. జనాభా ప్రాతిపదికన కొత్త గ్రామాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పాటు కానున్న జీపీల చిత్రాలు, వివరాలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి మండల అధికారులు ఇప్పటికే అందజేశారు. మండలంలోని మాడ్గుల పంచాయతీ నుంచి పెద్ద మాడ్గుల, ఇర్విన్ పంచాయతీ నుంచి దిల్‌వార్‌ఖాన్‌పల్లిలను కొత్త గ్రామాలుగా గుర్తించారు. కొత్త పంచాయతీల ఏర్పాటుతో మండలంలో గ్రామాల సంఖ్య 36కు పెరగనుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల ఏర్పాటుతో ప్రజలకు ప్రభుత్వ పాలన మరింత చేరువకానుందని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కడ్తాల్: మండల పరిధి ముక్తమాధారం గ్రామంలో సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1.20 కోట్లతో ముక్తమాధారం- నాగిరెడ్డితండాల మధ్య నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పర్యటనలో పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా.. ఉదయం 10 గంటలకు తహసీల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి.. 31 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నారని తహసీల్దార్ ముంతాజ్ తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సీపీఎం ఏరియా కన్వీనర్‌గా శివశంకర్



ఆమనగల్లు: సీపీఎం ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్ ఏరియా కన్వీనర్‌గా శివశంకర్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన మహాసభల్లో జిల్లా కార్యదర్శి భాస్కర్, నాయకులు కానుగుల వెంకటయ్య సమక్షంలో నూతన కమిటీని నియమించారు. ఏరియా కన్వీనర్‌గా శివశంకర్, సభ్యులుగా పెంటయ్య, కురుమయ్య, చెన్నయ్య, నర్సింహ, రమేశ్, పోచయ్య, హంసమ్మలను ఎన్నుకున్నారు.

ఏబీవీపీ పట్నం కార్యదర్శిగా మహేందర్



ఇబ్రహీంపట్నం: ఏబీవీపీ ఇబ్రహీంపట్నం నగర కార్యదర్శిగా రుద్రపల్లి మహేందర్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ శివకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తప్పకుండా నెరవేరుస్తానని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని వెల్లడించారు.

నేడు డివిజన్ స్థాయిలో ప్రజావాణి

ఇబ్రహీంపట్నం: కలెక్టర్ ఆదేశాల మేరకు ఇకపై డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఆర్డీఓ అనంతరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం కొనసాగనుందని పేర్కొన్నారు. రెవెన్యూ విభాగానికి సంబంధించిన వినతులే కాకుండా ఇతర శాఖల అర్జీలు స్వీకరిస్తామని, అన్ని శాఖల అధికారులు హాజరు కానున్నారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



కడ్తాల్: పడిపూజలో మాలధారులు తదితరులు

కడ్తాల్: మండల పరిధి కొండ్రిగానిబోడ్ గ్రామ పంచాయతీలో ఆదివారం కేరళకు చెందిన చంద్ర మోహన్ నాయర్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాల ధారణ భక్తులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు సత్యం యాదవ్, పాండు, బీమ్లా, బిక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం: ఇరుముడి పూజలో గురుస్వామి తదితరులు

ఘనంగా ఇరుముడి పూజ

యాచారం: మండల పరిధి మొండిగౌరెల్లి గ్రామంలో సన్నిధానం గురుస్వామి పర్షమోని పాండు ముదిరాజ్ పర్యవేక్షణలో గురుస్వామి చందర్‌నాయర్ చేతుల మీదుగా మాలధారులకు ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సన్నిధానం స్వాములకు మండలి దీక్ష 41 రోజుల పాటు అన్నదానం, ఇతర ఖర్చులు చెల్లించిన గుర్రం చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రవీందర్, సోమేష్ కుమార్, జంగయ్య, మహేందర్‌రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధి నుచ్చుగుట్టతండా 197 బూత్ బీజేపీ కమిటీ అధ్యక్షుడిగా బాలు నాయక్‌ను నియమించారు. తండాలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, బీజేపీ పుర అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, బీజేవైఎం నాయకులు రవిరాథోడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరిలాల్, శివరాం, నార్య, నంగ్రియా, పత్యానాయక్, హనుమంతు, నరేందర్ రాథోడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'లయన్స్' మాజీ గవర్నర్‌కు సన్మానం



చెన్నకిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ ప్రతినిధులు

ఆమనగల్లు: నగరంలోని ఇంటర్‌నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులుగా కొనసాగిన 52వ ఇసామి లయన్స్‌క్లబ్ ఫోరం సమావేశం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా లయన్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డిని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఫెబ్రిషియో ఘనంగా సన్మానించారు. లయన్ మల్టిపుల్ 320 జిల్లా పరిధిలో క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కోసం అత్యధిక విరాళాలు సేకరించడంతో పాటు.. 18 ఏళ్లుగా క్లబ్‌కు సేవలు అందించిన నేపథ్యంలో కిషన్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో లయన్ ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్, క్లబ్ అంతర్జాతీయ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ పాటిల్, డైరెక్టర్ బాబురావ్, ఆమనగల్లు లయన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బాలాజీ ఆలయంలో విద్యార్థుల పూజలు



బాలాజీ ఆలయ సన్నిధిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహేశ్వరం: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం కుదురుమల్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలో భాగంగా ఆదివారం మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బాలబాలికలు ఆలయ ఆవరణలోని చెట్ల కింద సహపంక్తి భోజనాలు చేశారు. అంతకు ముందు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయప్ప పర్యవేక్షణలో 94 మంది విద్యార్థులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను సందర్శించారు. ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీనివాస్, తిరుపతి, సిబ్బంది మొఘలప్ప, నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లోని 28వ డివిజన్ మారుతీనగర్ కాలనీలో ఆదివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ చిగురింత పారిజాత హాజరై స్థానిక కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్‌తో కలిసి డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌లలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని చెప్పారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్, నయనాచారి, నరేశ్, వెంకటేశ్, ప్రదీప్, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

లెనిన్‌నగర్‌లో రోడ్డు నిర్మించాలి



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌లో కొత్తగా రోడ్డు వేయాలని బీజేపీ స్థానిక నాయకుడు చెవ్వ శ్రవణ్ ఆదివారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లెనిన్‌నగర్ ప్రాంతంలో ఆరు వార్డులకు కలిపి ఒకే ప్రధాన రహదారి కావడంతో.. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. చాలాకాలంగా ఎలాంటి మరమ్మతులు చేపట్టని కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఎవరూ స్పందించలేదని ఆరోపించారు. ప్రజల అవసరాలు, రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని రహదారిని నూతనంగా నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పార్టీ నాయకులు మధు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కందుకూరు: తుక్కుగూడ కొండేటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్లు సౌమ్య, ప్రమోద్‌కుమార్‌లు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, తమ ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం గర్భిణులు, మహిళలతో పాటు, బీపీ, షుగర్, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రతి సోమవారం ఉచితంగా ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కొండేటి మల్లయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.పాండు, నాయకుడు ఎస్.జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

తుర్కయంజాల్: పురపాలిక పరిధి కమ్మగూడలోని సుందరయ్య కాలనీకి చెందిన తిరుపతయ్య ఇటీవల మృతి చెందాడు. ఆర్థిక పరిస్థితులతో సతమతమవుతున్న బాధిత కుటుంబానికి మేమున్నామంటూ పలువురు ముందుకు వచ్చారు. ఇంజాపూర్ శ్రీరంగాపురం కాలనీ పద్మశాలీలు రూ.16,902, రాగన్నగూడ పద్మశాలి సంఘం సభ్యులు రూ.15వేలు, బీఎన్‌రెడ్డినగర్ శివ మార్కండేయ దేవాలయ కమిటీ సభ్యులు రూ.22,500లను ఆదివారం అందజేశారు. దాతలు ముందుకు తిరుపతయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సభ్యులు కోరారు.

వేడుకలకు ముస్తాబైన చర్చి

యాచారం: క్రిస్మస్ నేపథ్యంలో మండల పరిధిలోని చర్చిలన్ని ముస్తాబయ్యాయి. ఈ నెల 25న జరగనున్న పండుగను పురస్కరించుకుని కుర్మిద్ద గ్రామంలోని ప్రార్థనాలయానికి నిర్వాహకులు రంగులు వేసి, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న కుర్మిద్ద ప్రార్థనాలయం

పదునెట్టాంబడికి వేళాయే



మెట్లు ఎక్కుతున్న అయ్యప్ప భక్తులు(ఫైల్)

రేపటి నుంచి అయ్యప్ప ఆలయ బ్రహ్మోత్సవాలు

మహేశ్వరం: 'స్వామి శరణం.. అయ్యప్ప శరణం' అంటూ అయ్యప్ప మాలధారణ భక్తులు తలపై ఇరుముడి కట్టుకొని కేరళలోని శబరమలై ఆలయంలో పదునెట్టాంబడి (18 మెట్లు ఎక్కుతూ) సందర్భంగా శరణుఘోష చేస్తుంటారు. శబరీమల మాదిరిగానే బాలాపూర్ మండల పరిధి మామిడిపల్లి బాల మణికంఠ అయ్యప్పస్వామి దేవస్థానంలో భక్తులకు పదునెట్టాంబడి అవకాశం ఉంది. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏటా మండల మహా పడిపూజ సందర్భంగా భక్తులకు ఇక్కడి ఆలయంలో పదునెట్టాంబడి అవకాశం కల్పించారు. దీంతో భక్తులు తరలివస్తుంటారు. ఈ నెల 26న జరుగనున్న మహా పడిపూజకు మాలధారులు భారీగా రానున్నారు. అయ్యప్ప సన్నిధిలో విఘ్నేశ్వరుడు, లక్ష్మీదేవి, సుబ్రహ్మణ్య స్వామి కొలువుదీరాడు. ఇక ఆలయ దిగువన రాహుకేతువు ఉన్నాడు.

2015లో విగ్రహ ప్రతిష్ఠాపన

మామిడిపల్లి గ్రామాన్ని ఆనుకొని పంట పొలాల్లో 2006లో శంకుస్థాపన చేసిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని 2015లో పూర్తి చేశారు. అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తొలి ఏడాది నుంచే ఇక్కడ పెద్ద సంఖ్యలో మాలధారణ చేసి, పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో సీజన్‌లో ఘనంగా పడిపూజ నిర్వహిస్తుంటారు. మాలధారణ చేసి శబరీమలైకి వెళ్లలేని వారి ఇరుముడిలు ఇక్కడ తీస్తున్నారు.



అయ్యప్ప స్వామి దేవాలయం

స్వామి దర్శనం వరం



అయ్యప్పస్వామి దర్శనం మాకు వరం. ఈ సారి ఇక్కడ 100 మందికి పైగా భక్తులు మాలధారణ చేశారు. 32 ఏళ్లుగా స్వామి వారి సేవలో ఉన్నా. 24న గణపతి హోమం, ధ్వజారోహణం నిర్వహిస్తాం. 25న లక్ష పుష్పార్చన, స్వామి వారి ఊరేగింపు, 26న అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం నిర్వహించనున్నాం. కేరళ ఆలయ సహాయ అర్చకుడు ఉన్నికృష్ణన్ నంబూద్రీ పర్యవేక్షణలో కార్యక్రమాలు కొనసాగుతాయి.

– జగదీశ్వర్ రెడ్డి, గురుస్వామి, ఆలయ ధర్మకర్త